నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

మౌనముద్ర దాల్చ మౌనిగాడెవ్వడు
వాగినంతతోడ వాజ్మి గాడు
జ్ఞానతృష్ణచేత జ్ఞానియై వెలుగొందు
తెలిసి మసలుకొనుము తెలివితోడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి

---

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 149 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 26-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు

- అమెరికాసుంకాలపై మోడీ పరోక్ష వ్యాఖ్య
- గుజరాత్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకుశ్రీకారం

**అహ్మదాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి పరోక్షంగా స్పందించారు. 'ఎంత ఒత్తిడి వచ్చినా.. రైతులకు హాని జరగనివ్వం' అని చెప్పారు. సోమవారం అహ్మదాబాద్ లో రూ.5,400 కోట్ల విలువైన పలు ప్రాజెక్టుల పనులను ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు-చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా సుంకాలపై కీలక వ్యాఖ్యలు

-మిగతా 2 లో

### ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో

# ఉస్మానియా అభివృద్ధి



## తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా

- తెలంగాణ, ఉస్మానియా రెండు అవిభక్త కవలలు
- మహామహులంతా ఇక్కడి నుంచి ఉద్భవించిన వారే
- ఓయూకు పూర్వ వైభం తీసుకొచ్చేలా ప్రతిపాదనలు
- నిధులు ఇచ్చి అభివృద్ధి చేసేందుకు వెనకాడం
- నిరిసించే వారికి సమాధానం చెప్పేందుకు సిద్ధం
- యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ
- ఓయూలో వసతి గృహాలను ప్రారంభించిన సీఎం రేవంత్

**హైదరాబాద్,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ అని, తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు.. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది కూడా ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, బీమా వసతి భవనాలను ప్రారంభించిన

-మిగతా 2 లో





## రేఖాగుప్తాకు జడ్ ప్లస్ ఉపసంహరణ

- ఢిల్లీ పోలీసులకే బాధ్యతలు అప్పగింత

**న్యూఢిల్లీ,** ఢిల్లీ ముఖ్యమంత్రికి కల్పించిన జెడ్ కేటగిరీ సీఆర్‌పీఎఫ్ సెక్యూరిటీని కేంద్రం ఉపసంహరించుకున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇకపై ఢిల్లీ పోలీసులు ముఖ్యమంత్రికి భద్రత కల్పించనున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారిక కార్యక్రమంలో ఓ వ్యక్తి సీఎం రేఖా గుప్తాపై దాడి చేసిన నేపథ్యంలో కేంద్రం సీఎంకు జెడ్ క్యాటగిరీ భద్రత కల్పించింది. ముఖ్యమంత్రికి భద్రత కల్పించాలని కేంద్ర హోమ్ శాఖ సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. ఈ భద్రతను మరింత కాలం పొడిగించొచ్చన్న వార్తలు వెలువడ్డాయి. అయితే, కేంద్రం ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీ భద్రతా

-మిగతా 2 లో

## జైలు నుంచే పాలన చేస్తామంటే ఎలా

- ఎవ్వరైనా జైలుకెళితే పదవి ఊడాల్సిందే
- కేంద్రహోంమంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం ఎలా కుదురుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ

-మిగతా 2 లో

## భారత్‌పై కావాలనే ట్రంప్ సెకండరీ టారిఫ్స్

- 'రష్యాపై ఒత్తిడి పెంచేందుకు భారత్‌పై అధిక టారిఫ్‌లు
- ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



**న్యూఢిల్లీ,** రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్ (పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. అమెరికా తీరుపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌పై యూఎస్ విధించిన టారిఫ్‌లపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా స్పందించారు.

-మిగతా 2 లో

## రాముడిని ఎగతాళి చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కరీంనగర్,** కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో శ్రీరాముడి పేరును ఎగతాళి చేస్తూ వస్తోందని, రాముడి పట్ల వారికి గౌరవం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం బండి సంజయ్ మాట్లాడుతూ - రామ సేతు కేసులో సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ కాంగ్రెస్‌నే. దశాబ్దాల పాటు- రామ మందిర తలుపులు మూసి వేసింది కూడా కాంగ్రెస్‌నే అన్నారు. రాహుల్ గాంధీ ఒకప్పుడు 'రామ్ మందిర ఉద్యమం ఓడిపోయింది' అని వ్యాఖ్యానించలేదా? హిందువులను 'హింసాత్మకులు' అని అన్నది కాంగ్రెస్‌నే అని గుర్తుచేశారు. రామ్ మందిర ప్రాణ ప్రతిష్ఠకి కూడా హాజరుకావడానికి నిరాకరించింది అదే పార్టీ అని ఆరోపించారు. ఇక ఇప్పుడు రాముని పేరు ప్రస్తావిస్తున్న బీజేపీని కాంగ్రెస్ ఎగతాళి చేస్తోందని, ఇది వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు

-మిగతా 2 లో

## ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్, మంత్రులు

- బీసీ బిల్లుపై న్యాయ కోవిదులతో చర్చ
- రాహుల్ ర్యాలీలో పాల్గొనేందుకు నేడు బీహార్‌కు



**న్యూఢిల్లీ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి,డిప్యూటి సిఎం మల్లు భట్టి క్రమార్క, పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరులు ఢిల్లీ చేరుకున్నారు. బిసి బిల్లుపై న్యాయ కోవిదులతో చర్చించనున్నారు. అలాగే సీనియర్ లాయర్, ఎంపి అభిషేక్ సింఘ్వీ, జస్టిస్ సుదర్శన్ రెడ్డిలతో చర్చిస్తారు. అలాగే మంగళవారం

-మిగతా 2 లో

## ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం

- నిలదీస్తారనే భయంతో విద్యార్థుల అరెస్ట్
- సీఎం ఓయూ పర్యటనపై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,** సీఎం రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ- పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు

-మిగతా 2 లో

### మోసం చేయడంలో

# ఇద్దరు ఇద్దరే

## ఉద్యోగాల పేరుతో టోపీ పెట్టిన మోడీ,రేవంత్

- హామీలు నెరవేర్చకుండా మభ్యపెడుతున్న సీఎం
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విమర్శలు




**హైదరాబాద్,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రధాని మోదీ, తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాలని సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధ్వజమెత్తారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ.. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని రేవంత్ చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఇద్దరూ కలిసి ఒక్క హామీని కూడా ఎందుకు అమలు చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ భవన్‌లో ఆర్మూర్ నేలను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడారు.బడే భాయ్, చోటే భాయ్ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారని , ఆయన సంచలన వ్యాఖ్యలు

-మిగతా 2 లో



## బీఆర్ఎస్ అదృశ్యం ఖాయం

- రాజకీయ ముఖచిత్రంలో ఇక మాయం
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు

**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ అనే పార్టీ ఉండదని టీ- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కరీంనగర్ కార్యకర్తల మీటింగ్ లో మాట్లాడిన ఆయన.. పది మంది ఎమ్మెల్యే సంగతి తర్వాత ముందు మీ కుటుంబ ఆస్తుల పంచాయితీ తేల్చుకోవాలని కేటీఆర్ పై సెటైర్ వేశారు. లక్షా 20 వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ వాళ్లను దోషులుగా తేలిస్తే సుప్రీం కోర్టును ఆశ్రయించారు కానీ ప్రజా క్షేత్రంలో బీఆర్ఎస్ కు శిక్ష తప్పదని హెచ్చరించారు. గత పదేళ్లలో తెలంగాణలో శాంపిల్ సర్కార్ నడిపించారని ఫైర్ అయ్యారు. సమావేశంలో మాట్లాడిన

-మిగతా 2 లో

## ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు

(మొదటి తరువాయి)

చేశారు. ఎంత ఒత్తిడి వచ్చినా.. తమ ప్రభుత్వం తట్టు-కునే బలాన్ని పెంచుకుంటూనే ఉంటు-ందని అన్నారు. చిన్న పారిశ్రామికవేత్తలు, రైతులు, పశుపోషకులకు ఎటు-వంటి హాని జరగనివ్వదని అన్నారు. నేడు ప్రపంచంలో, ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా రాజకీయాలు చేయడంలో బిజీగా ఉన్నారు. ఈ అహ్మదాబాద్ గడ్డ మీద నుంచి చెబుతున్నా.. చిన్న పారిశ్రామికవేత్తలు, రైతులు, పశుపోషకులు.. అందరికీ, నేను మీకు పదే పదే హామీ ఇస్తున్నా. మీ ప్రయోజనాలు మోడీకి అత్యంత ముఖ్యమైనవి. ఎంత ఒత్తిడి వచ్చినా, తట్టు-కునే శక్తిని మనం పెంచుకుంటూనే ఉంటాం అని చెప్పారు. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలంటూ డోనాల్డ్ ట్రంప్.. భారత్ పై భారీ సుంకాలు విధించాడు. రెండు సార్లు 25 శాతం చొప్పున మొత్తం 50 శాతం అదనపు సుంకాలను విధించాడు. తాము చెప్పినట్లు- వినకపోతే.. భారత్ మరిన్ని సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## జైలు నుంచే పాలన చేస్తామంటే ఎలా

(మొదటి తరువాయి)

ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుందని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదని అమిత్ షా అన్నారు.ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది.

## భారత్‌పై కావాలనే ట్రంప్ సెకండరీ టారిఫ్స్

(మొదటి తరువాయి)

ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యాను అడ్డుకునేందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌పై అధిక టారిఫ్‌లు విధించినట్లు చెప్పుకొచ్చారు.ఎన్‌బీసీ న్యూస్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. 'రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అధ్యక్షుడు ట్రంప్ కావాలనే భారత్‌పై అధిక టారిఫ్స్ విధించారు. ఆయిల్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని ఆపాలనే లక్ష్యంతోనే ఈ చర్యలు. చమురు నుంచి వచ్చే ఆదాయం తగ్గిపోతే ఉక్రెయిన్‌పై దాడులు చేయడం మాస్కోకు కష్టతరమవుతుంది. దాడులను ఆపమని రష్యాను బలవంతం చేయడానికి ట్రంప్ దూకుడుగా ఆర్థిక ఒత్తిడి విధానాన్ని అవలంభించారు. భారత్‌పై సెకండరీ టారిఫ్స్ ఇందులో భాగమే. హత్యలను ఆపితే రష్యాను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి తిరిగి ఆహ్వానించొచ్చు. కానీ, దాడులు కొనసాగితే అది ఒంటరిగా ఉండాల్సి వస్తుంది' అని జేడీ వాన్స్ తెలిపారు.

## రేఖాగుప్తాకు జడ్ ప్లస్ ఉపసంహారణ

(మొదటి తరువాయి)

ఏర్పాట్లను తొలగించేందుకు నిర్ణయించింది. ఇకపై సీఎం భద్రత వ్యవహారాలను ఢిల్లీ పోలీసులు పర్యవేక్షించనున్నారు. సీఎం రేఖ గుప్తా సివిల్ లైన్స్‌లోని 'జన్ సున్‌వాయి' కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సక్రియా రాజేశ్‌భాయ్ ఖిమ్జి ఆటోడ్రైవర్ అని, అతడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన వాడని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తులో భాగంగా పోలీసులు.. సీఎం నివాసంలో భద్రతా లోపాలను కూడా గుర్తించారు. ఈ లోపాల కారణంగా పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను హోం మంత్రిత్వ శాఖకు పంపించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## రాముడిని ఎగతాళి చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

(మొదటి తరువాయి)

రాముని అవమానించడం అలవాటే. కానీ బీజేపీకి రాముడు అంటే ప్రాణం, విశ్వాసం. రాముడు రాజకీయాల కోసం కాదు... ఈ దేశపు గుండె చప్పుడు అని ఆయన స్పష్టం చేశారు. రామ మందిర నిర్మాణం, ప్రాణ ప్రతిష్ఠ వంటి సందర్భాల్లో కాంగ్రెస్ వైఖరి ప్రజలు మర్చిపోలేరని, రాముని పట్ల ఉన్న ఆప్యాయతను బీజేపీ ఎప్పటికీ రాజకీయం చేయదని బండి సంజయ్ పునరుద్ఘాటించారు.

## బీఆర్ఎస్ అదృశ్యం ఖాయం

(మొదటి తరువాయి)

మహేశ్ కుమార్ గౌడ్.. జనహిత పాదయాత్ర వల్ల బీజేపీ, భారాస కు కడుపు నొప్పి వస్తుంది. కార్యకర్త త్యాగ ఫలితంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రజల్లో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకునేందుకే జనహిత పాదయాత్ర చేపట్టాం. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న కార్యకర్తలను వదిలిపెట్టుకోబోమన్నారు. పేదవారి జీవిత కాల స్వప్నమైన ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నాం. పథకాలు రాని 10 శాతం వారే ఇబ్బంది పెడుతున్నారు .దీనిపై కార్యకర్తలు దృష్టి పెట్టాలి. బండి సంజయ్ వ్యాఖ్యల వల్లే బీసీ బిల్లు పెండింగ్ లో ఉంది. దేవుడి పేరు చెప్పకుండా బండి సంజయ్ మళ్ళీ గెలుస్తారా అని ప్రశ్నించారు. .అంబానీ, అదానీలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతుంది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గలేదు. 12 ఏళ్లలో రాష్ట్రానికి బీజేపీ ఏం చేసింది.? రాష్ట్రంలో జరిగిందంతా కాంగ్రెస్ హయంలోనే జరిగింది. 42 బీసీ రిజర్వేషన్స్ లో ముస్లింలకు 5.8 శాతం మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే 4 శాతం ఉంది. అయినా బీజేపీ 10 శాతం అని తప్పుడు ప్రచారం చేస్తోంది. బీజేపీ ఎంపీల వల్ల బీసీ ప్రజలకు అన్యాయం జరుగుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు .కరీంనగర్ బిజెపి ఎంపిలు దొంగ ఓట్లతో గెలిచారని టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దొంగ ఓట్లతో గెలిచినట్టు- తమ దగ్గర ఆధారాలున్నాయని అన్నారు. మహేష్ మీడియాతో మాట్లాడుతూ..బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ కి మెజారిటీ- ఎలా వస్తుంది? అని ఒకే డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో 69 ఓట్లు- ఎలా ఉంటాయని ప్రశ్నించారు. బండి సంజయ్ అసలు బిసినే కాదని ఆయన దేశ్ ముఖ్ అని తెలియజేశారు. తెలంగాణలో ఓట్ల చోరిపై ఇసిని కలుస్తామని అన్నారు. ఎన్నికల సంఘం ఇలా ఉండటం మన దౌర్భాగ్యం అని ఆవేదనను వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపి అర్వింద్ గెలుపుపై కూడా అనుమానం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వాళ్లు 10 నెలలు ఖచ్చితంగా పార్టీ కోసం పనిచేయాలని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి అవకాశాలు ఉంటాయి కానీ పాత వారికి ముందు అవకాశం వస్తుందన్నారు. కరీంనగర్ లో కార్యకర్తల మీటింగ్లో మాట్లాడిన మీనాక్షి నటరాజన్.. ఓట్ చోరీ నీ ఆపాలంటే ఓటర్ లిస్ట్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో ఉస్మానియా అభివృద్ధి

(మొదటి తరువాయి)

అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు..సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది.. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులే.. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి ఈ యూనివర్సిటీ విద్యార్థినే.. తెలంగాణ నలుమూలలా ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే..అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే.. యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర సాధనలో సమిధలయ్యారు.. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీది.. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగింది.. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని మేం ఆలోచన చేశాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాం.. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించాం.. తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే మేధా సంపత్తిని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆశిస్తున్నాం.. అన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరం.. దేశంలో 60 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే.. ఇది మన దేశ సంపద.. 21 ఏళ్ల వయసులో దేశానికి సేవలంది

స్తున్నప్పుడు.. 21 ఏళ్ల యువకులు శాసన సభలో ఎందుకు అడుగుపెట్టకూడదు?.. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆవేదన కలుగుతోంది.. యువతను గంజాయి, డ్రగ్స్ వ్యసనాలు పట్టి పీడిస్తున్నాయి.. గంజాయి, డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి.. ఆ వ్యసనాల నుంచి యువతను బయటపడేలా చేయాలి.. చదువు, చైతన్యం ఉంటేనే సమాజంలో రాణిస్తారు.. నా దగ్గర పంచడానికి భూములు లేవు, ఖజానా లేదు మీకు నేను ఇవ్వగలిగింది విద్య ఒక్కటే.. అన్నారు. మీ తలరాతలు మార్చేది చదువొక్కటే.. చదువు ఒక్కటే మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది, గుణవంతులను చేస్తుంది.. పేదరికం మాకు కొత్త కాదు.. ఆ పేదరికాన్ని చూసి వచ్చినవాళ్ళం.. పేదరికాన్ని పారద్రోలడం మాకంటే ఎక్కువ ఎవరికీ తెలియదు.. యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ వేయాలని అధికారులను ఆదేశిస్తున్నా.. ఉస్మానియా యూనివర్సిటీని స్టాన్ ఫర్డ్, ఆక్స్ ఫర్డ్ స్థాయిలో తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి.. ఉస్మానియా యూనివర్సిటీ- లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు.. యూనివర్సిటీ- అభివృద్ధికి ఏం కావాలో అడగండి.. అంచనాలు తయారు చేసి ఇవ్వండి..అని అన్నారు. మళ్లీ యూనివర్సిటీకి వస్తా.. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెట్టి నిధులు మంజూరు చేస్తా..పోలీసులకు నేను ఆదేశిస్తున్నా.. ఆ రోజు యూనివర్సిటీ లో ఒక్క పోలీస్ కనిపించొద్దు.. నిరసన తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి.. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకుంది.. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు పోయాయన్న ఆవేదన ఉంటుంది.. వాళ్ల కొడుకులను ఏదో చేద్దామనుకుంటే ఏదో అవుతున్నారని బాధ ఉంటది.. వారి ఉచ్చులో మీరు పడొద్దు.. సమస్య ఉంటే మాకు చెప్పండి.. మా మంత్రులు మీకు అందుబాటులో ఉంటారు.. కోదండరామ్ సార్ పై కుట్ర చేసి సుప్రీం కోర్టుకు వెళ్లి పదవి తొలగించారు.. ఇదేం పైశాచిక ఆనందం.. మళ్లీ కోదండరాం సార్ కు ఎమ్మెల్సీ ఇస్తాం..అని ప్రకటించారు. అపోహలకు లోను కాకండి.. అబద్ధాల సంఘం చెప్పే మాటలు నమ్మొద్దు..వాట్సాప్, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో సెంట్రల్ యూనివర్సిటీలో సింహాలు, ఏనుగులు ఉన్నాయని ప్రచారం చేసి అడ్డుకున్నారు.. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేనేలేవు.. మానవ రూపంలో ఉన్న మృగాలు ఉన్నాయి.. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు లాంటివారు.. వాళ్లు తెలంగాణ సమాజం బాగు కోరుకోరు.. వాళ్లు మళ్లీ వస్తే ఉస్మానియా యూనివర్సిటీని ఉండనివ్వరు.. మీ చదువుకు ఏం కావాలో అడగండి.. ఉస్మానియా యూనివర్సిటీని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ తెలిపారు.

# ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్, మంత్రులు

(మొదటి తరువాయి)

బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ర్యాలీలో సిఎం తదితర మంత్రులు పాల్గొంటారు. ఇకపోతే వెనుకబడిన వర్గాల వారికి 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసులో ఇంప్లీడ్ కానుందని సమాచారం. రాష్ట్రపతి గవర్నర్ కు పంపిన బిల్లుల ఆమోదంపై రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆరు నెలల క్రితం బీసీలకు 42??? రిజర్వేషన్లు కేటాయిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. దానిని గవర్నర్ కు పంపగా.. ఆయన కేంద్ర హోంశాఖ ద్వారా రాష్ట్రపతికి పంపారు. తమిళనాడు, కేరళ కేసుల్లో తెలంగాణ కూడా ఇంప్లీడ్ కావాలని బావిస్తోంది. ఈ మేరకు సుప్రీంకోర్టుద్వారా కేంద్రపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించనుంది. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. న్యాయ నిపుణులతో చర్చించనున్నట్టు- తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల కోసం ఎంపిక చేసిన మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఢిల్లీ వెళ్లారు. ఉదయం సీఎం రేవంత్ రెడ్డి ఈ మంత్రులకు పర్సనల్ గా కాల్ చేసి ఢిల్లీకి రావాలని కోరారు. దీంతో వరంగల్ పర్యటనలో ఉన్న సీతక్క, కరీంనగర్ పాదయాత్రలో ఉన్న పొన్నం ప్రభాకర్ సహా మిగిలిన మంత్రులు హుటాహుటిన ఢిల్లీ బయల్దేరివెళ్లారు. అక్కడ న్యాయ కోవిదులతో చర్చించి సుప్రీంకోర్టు లో పెండింగ్ లో ఉన్న కేరళ, తమిళనాడు కేసులో ఇంప్లీడ్ కానున్నారు. సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు- పూర్తి చేసింది. 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ సూచన మేరకు కులగణన నిర్వహించి బీసీల లెక్క తేల్చింది. ఈ మేరకు 42 రిజర్వేషన్లు కేటాయిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీనిని ఎలాగైనా అమల చేయాలని చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాయడంతోపాటు- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా సైతం నిర్వహించింది. పార్లమెంటు-లో నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రపతిని కలిసి నేరుగా విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్నించగా అపాయింట్ మెంట్ దొరకలేదు. వీలైనంత త్వరగా బీసీ రిజర్వేషన్లను కొలిక్కి తేవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

## మోసం చేయడంలో ఇద్దరు ఇద్దరే

(మొదటి తరువాయి)




చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ , సీఎం రేవంత్‌రెడ్డి కలిసి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆటలో అరటిపండుగా మార్చారని ఎద్దేవా చేశారు. పెద్ద మోదీ, చిన్న మోదీ ఒకే రకంగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరూ కలిసి రాహుల్‌కు పెద్ద షాక్ ఇవ్వటం ఖాయమని జోస్యం చెప్పారు. ఉస్మానియాలో రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వం పునాది వేసిన భవనాలను ప్రారంభించారు. రేవంత్ రెడ్డి వికృత మాటలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. గత ముఖ్యమంత్రులతో పోల్చి చూస్తూ ప్రజలు రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు. రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. మా ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడానికి తాపత్రయ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ. రెండూ దొందూ దొందే. పెట్టు-బడులు, పరిశ్రమలు, విభజన హామీలు - అన్నింటిలోనూ బీజేపీ తెలంగాణకు మోసం చేసింది' అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోంది. 20 నెలల కాంగ్రెస్ పాలన నచ్చకుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు ఈ ప్రభుత్వం చేయించడం లేదు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి నీళ్లను దిగువకు పంపించేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు. గోదావరి నీళ్లు బకనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలని బీజేపీ ప్రభుత్వం రేవంత్‌కు ఆదేశాలిచ్చింది. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు. మోదీకి, రేవంత్‌కి అనేక పోలికలు ఉన్నాయి. కాంగ్రెస్ పాలన వల్లే తెలంగాణలో యూరియా సంక్షోభం వచ్చింది. ఒకవైపు యూరియా సంక్షోభం ఉంటే, రేవంత్ రెడ్డి సినిమా వాళ్లతో మీటింగ్ పెట్టు-కున్నారు. రేవంత్‌పై మాట పడకుండా బీజేపీ కాపాడుతోందని మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం

(మొదటి తరువాయి)

విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికెడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు.ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడిక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ-కి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య అన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టు-కున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా... ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. కేసిఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు- తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవని మండిపడ్డారు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది.

2025 ఆగస్టు 26, మంగళవారం తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**
**భాద్రపద మాసం**
**శుక్లపక్షం**
**తిథి**
**శుక్ల తృతీయ: ఆగస్టు 26 ఉద. 12:47 వరకు**
**శుక్ల చతుర్థి: ఆగస్టు 26 ఉద. 12:47- ఆగస్టు 27 ఉద. 10:55 వరకు**
**నక్షత్రం**
**ఉత్తర: ఆగస్టు 26 ఉద. 08:51 వరకు**
**హస్త: ఆగస్టు 26 ఉద. 08:51- ఆగస్టు 27 ఉద. 07:45 వరకు**
**శుభ సమయాలు**
**బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:27 - 5:13**
**అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:55 - 12:46**
**అశుభ సమయాలు**
**రాహుకాలం: మధ్యాహ్నం 3:00 - 4:30**
**యమగండం: ఉదయం 9:00 - 10:30**
**దుర్ముహూర్తం: ఉదయం 8:24 - 9:16 డ రాత్రి 10:23 - 11:07**
**వర్జ్యం: రాత్రి 11:14 - ఆగస్టు 27 ఉద. 12:43 వరకు**

## కుత్బుల్లాపూర్ అభివృద్ధికి 25 కోట్లు మంజూరు చేయాలని వినతి



**హైదరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబును సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి నిధుల నుంచి 25 కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. గతంలోనూ ఇదే అంశంపై మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరగా, మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి అధికారులకు తగిన సూచనలు చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీశైలం గౌడ్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణనాథుల పంపిణీ



**ఆల్విన్ కాలనీ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితాన్ని ప్రోత్సహిస్తూ ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలంగాణ ప్రభుత్వ మట్టి వినాయక విగ్రహాలను ఎల్లమ్మబండ గుడ్ విల్ హోటల్ చౌరస్తా వద్ద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రకృతిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మట్టి విగ్రహాలను పూజించి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలి" అని సూచించారు. కృత్రిమ రంగులు, విషపదార్థాలు వాడే విగ్రహాలు జీవవైవిధ్యానికి హానికరం అని తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, మల్లేష్, షౌకత్ అలీ మున్నా, లింగం, రాజుగౌడ్, అర్వరవి, సంపత్, ఎ. నాగేశ్వర నాయక్, ఎఫ్.ఏ మల్లేష్, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సూరారం ట్రాఫిక్ సమస్యపై జిహెచ్ఎంసికు బీజేపీ నాయకుల వినతి




**హైదరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సూరారం మెయిన్ రోడ్డు నుండి లక్ష్మీనగర్ వైపు వెళ్లే మార్గంలో ప్రతి శనివారం నిర్వహించే కూరగాయల మార్కెట్ వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని పేర్కొంటూ జిహెచ్ఎంసి కమిషనర్ మల్లారెడ్డి మరియు జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్హెచ్ఓ శ్రీనివాస్కు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిని 130 డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు అంగిడి మల్లేష్, దేవర రమేష్ ఆధ్వర్యంలో సమర్పించారు. ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించేందుకు మార్కెట్‌ను పక్కన గల్లీల్లోకి తరలించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతికంఠం బాలరాజు, పత్తికొండ సుధాకర్, శ్రమశక్తి అవార్డు గ్రహీత సుభాష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల ప్రయాణ సౌకర్యం దృష్ట్యా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## జాతీయ కరాటే పోటీల్లో ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ




**హైదరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యూసుఫ్‌గూడాలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్లో ఆమనగల్లు పట్టణానికి చెందిన జగదీశ్వర్ అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో జగదీశ్వర్ అకాడమీకి చెందిన క్రీడాకారులు 7 బంగారు, 2 రజత పతకాలు సాధించి ఆకట్టుకున్నారు. క్రీడా రంగంలో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి రావడం పట్ల స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## యూరియా కొరతపై మిర్యాలగూడలో సిపిఎం ధర్నా




**మిర్యాలగూడ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతుల అవసరానికి తగ్గట్టుగా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఏవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరాలో అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ రైతాంగం తరఫున పోరాటానికి దిగారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేషన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఇతర పార్టీ నాయకులు పాల్గొని, రైతుల పంట పొలాలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మిర్యాలగూడలో యూరియా అక్రమ సరఫరా, ఇన్వాయిస్‌ల లేని లావాదేవీలు వెలుగులోకి రావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సిపిఐ రాష్ట్ర కౌన్సిల్‌కు బంటు వెంకటేశ్వర్లు



**మిర్యాలగూడ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ సిపిఐ నాలుగవ మహాసభల్లో బంటు వెంకటేశ్వర్లును రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మిర్యాలగూడ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. నిత్యావసర ధరల పెరుగుదల, యూరియా కొరత, ఇళ్ల నిర్మాణం వంటి సమస్యలపై ప్రజలతో కలిసి ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## కల్వకుర్తిలో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన







**కల్వకుర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం ఆధ్వర్యంలో టాస్క్ స్కిల్ సెంటర్ ఏర్పాటుకు కల్వకుర్తి పట్టణంలో స్థల పరిశీలన జరిగింది. టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో బృందం పర్యటించింది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ స్కిల్ సెంటర్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, టెక్నికల్ కోర్సులు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ రీజినల్ హెడ్ సవీన్ రెడ్డి, షానావాజ్ ఖాన్, రజియా బేగం, జైపాల్ రెడ్డి, రచ్చ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై రైతుల ఆందోళన



**ఆమనగల్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతపై ఆమనగల్ మున్సిపాలిటీ రైతులు నిరసన తెలిపారు. పొలం పనులను పక్కనపెట్టి, యూరియా కోసం రోడ్డెక్కుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ, నెలకు ఒక్కసారైనా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికైనా యూరియా కొరతను తీరుస్తూ తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు నాగార్జున రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గోరటి నర్సింహా, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ దుడ్డు కృష యాదవ్, పార్లమెంట్ కో కన్వీనర్ నేనావత్ రవి రాథోడ్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన గణపతితో పర్యావరణ పరిరక్షణకు పిలుపు





**భువనగిరి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలంటూ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ క్యామ మల్లేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేన కార్యక్రమంలో భాగంగా, యాదాద్రి భువనగిరి జిల్లా కోఆర్డినేటర్ గుల్లని వెంకటేష్ ద్వారా విత్తన గణపతిని అందుకున్నారు. ఈ సందర్భంగా క్యామ మల్లేష్ మాట్లాడుతూ, "ప్రకృతి బాగుంటేనే సమాజం బాగుంటుంది. ప్రతి ఒక్కరూ విత్తన గణపతిని పూజించి, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి" అని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇంత మంచి కార్యక్రమానికి ప్రేరణనిచ్చిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతిరూపం మల్లన్న బోనాలు:

### -ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి






**ఫరూక్‌నగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫరూక్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో మల్లన్న బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించగా, ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి పాల్గొని మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొన్న ఆయన, "బోనాలు తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతిబింబం. ప్రజల విశ్వాసానికి, గ్రామీణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ ఉపసర్పంచ్ కంది యాదయ్య గౌడ్, ఎంపిటిసి అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోట్ల బాలరాజ్, జయంత్ రెడ్డి, భీమారం రాఘవేందర్ గౌడ్, మల్లేష్, దినేష్, బైండ్ల శివకుమార్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామం అంతా భక్తి, ఉత్సాహంతో నిండిపోయింది.

## స్థానిక ఎన్నికలకు బిజెపి శ్రేణులు సిద్ధం చందాపూర్ గ్రామంలో పార్టీ సమావేశం



**వనపర్తి ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బిజెపి శ్రేణులను సన్నద్ధం చేయాలని జిల్లా నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలకు వెళ్లే ధైర్యం లేదు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలన్నీ మోసపూరితమని ఇప్పటికే రుజువైంది" అని విమర్శించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించకపోతే బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీని గట్టిగా శిక్షిస్తుంది" అని హెచ్చరించారు .జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ, స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని, నిధుల కొరతతో పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్లు, గ్రామ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే బిజెపి అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధమని స్పష్టం చేశారు. సమావేశంలో మండల అధ్యక్షులు సంద వెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేమోని బాలరాజు, ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహ, కార్యదర్శి సంపత్, గ్రామ నాయకులు రాఘవేందర్, రాజశేఖర్, రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, ఎల్ల స్వామి, బూత్ అధ్యక్షులు డాకేష్, సతీష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత నూకం జంగయ్యకు ఘన నివాళులు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నూకం జంగయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి, వెదిరే హనుమంత్ రెడ్డి, సాతిరి ఎల్లేష్, అనంగల్ల యాదయ్య, కావలి శ్రీనివాస్, రావుల భాషయ్య, బుగ్గరాములు, చంద్రయ్య, జంగయ్య గౌడ్, సికిందర్ రెడ్డి, రాఘవ, నర్సింహా, కృష్ణ, లక్ష్మణ్, బీరుమల్లేష్, అశోక్, బాలరాజు, భాస్కర్, రాయుడు, గణేష్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై మానకొండూరులో బీజేపీ రాస్తారోకో



**మానకొండూరు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజీ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ అంటే దొంగల పార్టీ, ఓటుకు నోటు దొంగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" అంటూ తీవ్ర విమర్శలు చేశారు. బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలకు మహేష్ గౌడ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరివేద మహిపాల్ రెడ్డి, మాడ వెంకటరెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, రాపాక ప్రవీణ్, వంగల ఆంజనేయులు, అశ్విన్ తేజ, ప్రదీప్ యాదవ్, భూమయ్య, కోటేశ్వర్, శ్రీహరి, కిరణ్ రెడ్డి, సునంద్ కుమార్, రమేష్ పటేల్, బలరాం, సురేష్, హరీష్ కుమార్, అనిల్ యాదవ్, తాళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బీపీ మండల్ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**మిర్యాలగూడ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీ రిజర్వేషన్ల పితామహుడు శ్రీ బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) జయంతిని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఆయన సేవలను స్మరించుకున్నారు. బీసీ హక్కుల కోసం బీపీ మండల్ చేసిన పోరాటం, 27 శాతం రిజర్వేషన్ సాధనలో ఆయన పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ జాడీ రాజు, చేగొండి మురళి యాదవ్, దాసరాజు జయరాజు, కొర్రపిడత సురేష్ యాదవ్, పరంగి సురేష్, కంపసాటి మధుసూధన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నారం పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీ వర్క్‌షాప్



**మానకొండూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నారంలో విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాల తయారీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి సందర్శించి విద్యార్థులను అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఈ వర్క్‌షాప్ నిర్వహించారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నలుమాసు సుదర్శనం మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే పిల్లల్లో పర్యావరణ చైతన్యం పెంచితే భవిష్యత్ సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఆకుల మురలీకృష్ణ సమన్వయకర్తగా విజయవంతంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, కొండ శైలజ, జయేందర్ రెడ్డి, కూర శ్రీనివాస్, మమత, శ్రీవాణి, శైలజ, జైపాల్ రెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## అన్నారం గ్రామంలో యువకుడి ఆత్మహత్య





**మనకొండూరు, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అన్నారం గ్రామానికి చెందిన పప్పు గాంధీ (22) భూమి అమ్మకం విషయంలో ఇంట్లో నెలకొన్న గొడవలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాంధీ, సోమవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్థులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



**అచ్చంపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట క్యాంప్ ఆఫీస్లో మిషన్ భగీరథ–ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల వల్ల పైపులు దెబ్బతిని నీరు కలుషితమవుతున్న ఘటనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, అలసత్వం ఉంటే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. సమీక్షలో డీఈ, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కడ్తాల్,ఆగస్టు 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజా సంక్షేమే ధ్యేయంగా ప్రజా పాలను కొనసాగిస్తూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండలంలోని మక్తామదారం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ, గోవిందాయి పల్లి గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహ,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,తాసిల్దార్ ముంతాజ్,ఎంపీడీవో సుజాత వివిధ శాఖల అధికారులు, డిసిసి అధికార ప్రతినిధి గుడురు శ్రీనివాస్ రెడ్డి, బిచ్చ నాయక్, శేఖర్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ , యాదగిరి రెడ్డి, ఎల్ల గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అలీ తలాబ్ చెరువు శుభ్రత పనులు ప్రారంభం



**హైదర్‌నగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అలీ తలాబ్ చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాల వల్ల ఫ్లూ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శుభ్రత పనులు ప్రారంభమయ్యాయి. జిహెచ్ఎంసి శానిటేషన్ వాహనాలతో వ్యర్థాలను తొలగించి మందు పిచికారి చేయించారు. చెరువు అభివృద్ధిలో భాగంగా యుజిడి, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ వంటి పనులు నాణ్యతతో చేపడతామని కార్పొరేటర్ తెలిపారు.

## సురవరం సాహిత్య యోధుడు

ప్రధానోపాధ్యాయులు గౌతమ్ కుమార్ గుప్త





**వనపర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలుగు సాహితీ ప్రస్థానంలో సురవరం ప్రతాపరెడ్డి స్థానం అపూర్వమని వనపర్తి మాస్టర్ మైండ్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు గౌతమ్ కుమార్ గుప్తా సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ తో పేర్కొన్నారు. సురవరం గురించి క్లుప్తంగా ఆయన మాట్లాడుతూ –
" ప్రతాపరెడ్డి నిజమైన సాహిత్య యోధుడు,ఆయన రచనలు తెలుగువారి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను సమగ్రంగా ప్రతిబింబించాయి. ముఖ్యంగా ఆంధ్రుల చరిత్ర అనే గ్రంథం మన తెలుగు జాతి గౌరవానికి నిదర్శనం నిదర్శనమని ఆయన అన్నారు. నేటి యువత ఆయన రచనలను చదివితే, మన సాహిత్యం పట్ల గర్వం కలుగుతుంది" అని అభిప్రాయపడ్డారు. సురవరం ప్రతాపరెడ్డి చేసిన సాహిత్య సేవలు చిరస్మరణీయమని, ఆయనను స్మరించుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత అని, తను వనపర్తికి మొదటి శాసనసభ్యుడుగా ఎన్నుకోవడం వనపర్తికి అది ఒక గౌరవంగా భావిస్తున్నానని గౌతమ్ కుమార్ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు మానుకోవాలి

బీఆర్ఎస్ నాయకులు



**వనపర్తి,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్లచెరువు ట్యాంక్‌బండ్‌పై వాహనాల రాకపోకలు జరగకుండా రెండు వైపులా మెయిన్ గేట్ల నిర్మాణం చేపట్టకూడదని బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. నల్లచెరువు సుందరీకరణలో భాగంగా, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హయాంలో ట్యాంక్‌బండ్ విస్తరించి, భారీ వాహనాల రాకపోకలకు అనువుగా సీసీ డబుల్‌రోడ్డు నిర్మించారు. దీని వల్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి, గోపాల్పేట్ – ఘణపురం వెళ్ళే రోడ్డుకు బైపాస్‌గా ఉపయోగపడుతోంది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ, అధికారులు ట్యాంక్‌బండ్ రోడ్డుపై వాహనాలు నడవరాదంటూ రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయాలని టెండర్లు పిలిచి, భూమిపూజ జరిపినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ తెలిపారు. ఈ గేట్లు నిర్మిస్తే ట్యాంక్‌బండ్ అందం తగ్గిపోవడంతో పాటు, పట్టణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడతారని వారు కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నాగన్న యాదవ్, కంచె రవి, ఉంగ్లం తిరుమల్, హేమంత్ ముదిరాజ్, అవిశెట్టి భాగ్యరాజ్, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, జానంపేట శీను, తోట శీను, లక్ష్మన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న మట్టి వినాయకులు

**నారాయణఖేడ్,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వినాయకచవితి సందర్భంగా సోమవారం నారాయణఖేడ్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన మట్టి వినాయకులు అందరిని ఆకట్టుకున్నాయి. ఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్. ఉమాహారతి ఆదేశాల మేరకు,పాఠశాల అధ్యాపక బృందం సహకారంతో విద్యార్థినులు పోటాపోటీగా సొంతంగా మట్టి వినాయకులను తయారు చేశారు. డివిజన్ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలలో సోమవారం మట్టి వినాయకులను విద్యార్థులు తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వినాయకుల విగ్రహాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను మంగళవారం సబ్ కలెక్టర్ చేతులమీదుగా అందజేయనున్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు

**జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేసిన బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు**




**కడ్తాల్,ఆగస్టు 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ తాలూకా ఇంచార్జ్ గుర్క జైపాల్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు కడ్తాల్ మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ శ్రేణులు అభిమానులు ఘనంగా జరుపుకున్నారు.
కడ్తాల మండల కేంద్రములో సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అభిమానుల మధ్యలో బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శాలువాలు, పూలమాలలో ఘనంగా సన్మానించి జైపాల్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఎం ఆర్ పి ఎస్ మండల మాజీ అధ్యక్షులు సిద్దిగారి దాసు ఆయన అనుచరులు గులాబీ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కంబాల పరమేష్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, నాయక్,కడ్తాల్, ఆమనగల్ మండలాల సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, గంప శ్రీనివాస్, జోగు వీరయ్య, సుదర్శన్ రెడ్డి, ఎంపిటిసి లు లచ్చిరాం నాయక్, బొప్పిడి గోపాల్, చంద్ర మౌళి, ప్రియ రమేష్, ప్రవీణ్ గౌడ్,మాజీ సర్పంచులు, ఉపసర్పంచ్ లు జంగయ్య, రామ కృష్ణ, భారతమ్మ నరసింహ, వెంకటేష్, యాదయ్య, సాయిలు, రంగయ్య, పాండు, వినోద్, బాల కృష్ణ, మంగళ పల్లి నరసింహ, పిఏసిఎస్ డైరెక్టర్ సేవ్య నాయక్, వెంకటేష్, పార్టీ అధ్యక్షులు సాయి, కంబాల పల్లి అంజి, కొప్పు కృష్ణ, పోతగల్ల మహేష్, జంగయ్య, పవన్, మల్లేష్, అమృతం పాండు, లాయక్ అలీ, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

## నేడు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ



**కడ్తాల్,ఆగస్టు 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పర్యావరణ పరిరక్షణ కోసం గత ప్రభుత్వం 11 సంవత్సరాలుగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను నేడు కడ్తాల్ మండల కేంద్రంలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్ వద్ద ఉదయం 11 గంటలకు పంపిణీ చేయడం జరుగుతుందని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. సుమారు 1000 మట్టి ప్రతిమలను అందజేయడం జరుగుతుందని వినాయకుని పూజించే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు.

## కంచర్ల భూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలకు నేతల హాజరు



**నల్లగొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిశోర్ కుమార్, ఎన్. భాస్కర్ రావు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, కంచర్ల కృష్ణ రెడ్డి, ఒంటెద్దు నర్సింహ రెడ్డి, గుజ్జ యుగంధర్ రావు, రేగట్టే మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ అబద్ధపు హామీలపై మహేశ్వరం బీజేపీ నిరసన



**మహేశ్వరం, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను నిరసిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు టీ. యాదేష్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి మేమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా టీ. యాదేష్ మాట్లాడుతూ, "పేద ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ప్రశ్నిస్తుంది" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రేమరాజ్ యాదవ్, పాపయ్య గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్, మిద్దె సుదర్శన్, కే. అనంతయ్య, ఆంజల్లా యాదయ్య, సుదర్శన్ యాదవ్, పంతునాయక్, మాదవ చౌల్చి, మహీశ్వరి, మనోహర్, మోషననాయక్, శ్రావణ్, బుగ్గన శంకర్, టీ. అనివాస్, కృష్ణనామక, తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి



**( సరూర్ నగర్ ఆగస్టు 25: నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని సరూర్‌నగర్ డివిజన్‌లో పంజాల అనిల్‌కుమార్ కాలనీ,గాయత్రీ నగర్,వెంకట సాయి నగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ విజయదుర్గ సమేత ఉమామహేశ్వర దేవాలయ ప్రవేశద్వార ప్రారంభోత్సవం మరియు వార్షికోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త తో కలిసి మాజీ మంత్రి,మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయ కమిటీ వారు సబితా ఇంద్రారెడ్డి ని మెమెంటో, శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,సబితమ్మ అభిమానులు,కాలనీ ప్రజలు,భక్తులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో 187 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్

**–పెట్టుబడిదారులకు పిలుపు**



**భూపాలపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గణపురం మండలం మైలారం గుట్టల్లో 187 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులతో కలిసి పరిశీలించారు. 60 ఎకరాల్లో 197 ప్లాట్లు, 40 ఎకరాలు ఎడ్యుకేషన్ హబ్‌కు, 10 ఎకరాలు కేంద్రీయ విద్యాలయంకు, 20 ఎకరాలు సైనిక్ స్కూల్‌కు, 15 ఎకరాలు మార్కెట్ యార్డ్‌కు కేటాయించారు. రూ.1600 స్క్వేర్ ఫీట్ ధరకు టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పెట్టుబడిదారులకు ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. ఇప్పటికే రూ.4 కోట్ల రోడ్డు పనులు, మరో రూ.15 కోట్ల నిధుల సమీకరణ జరుగుతోందని తెలిపారు. ప్రాంతాన్ని టూరిజం, విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

## ఆసుపత్రిలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని దండుమైలారం మరియు యాచారం మండల కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. సోమవారం రూ.3.50 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, "పేద ప్రజలకు స్వచ్ఛమైన నీరు, మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఆసుపత్రికి వచ్చే రోగులకు దాహార్తి తీర్చేందుకు ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుంది" అని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రిని రూ.50 లక్షలతో మరమ్మతులు చేయించినట్లు పేర్కొన్నారు. త్వరలో ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిలక మధుసూదన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ, అమృత సాగర్, రామకృష్ణ, బిలకంటి శేఖర్ రెడ్డి, నవీన్ కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎర్రోళ్ల రాఘవేందర్



**కడ్తాల, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ హైదరాబాదులోని ఫిలింనగర్లో ఉన్న ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ, "జైపాల్ యాదవ్ మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నది నా ఆకాంక్ష" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో రావుల కుమార్ గౌడ్, క్యామ మహేష్, చుక్కని సందీప్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలు సాన్నిహిత్యంగా, ఉత్సాహంగా సాగాయి.

## ఘనంగా జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు



**వెల్దండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమక్షంలో జైపాల్ యాదవ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ద్యాప విజితా రెడ్డి, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, వెంకటేష్ గౌడ్, అరుణ ప్రభాకర్, జంగిలి నిరంజన్, జ్యోతి నిరంజన్, లింగం, శేఖర్, నరసింహ, యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, యువ నాయకులు జంగిలి ఆనంద్, పోలే అశోక్, నాగయ్య, జంగిలి ప్రవీణ్, దార ప్రభాకర్, జంగిలి రవి, గోరేటి రాజు, టైలర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు రాయితీ పథకం

**మాడుగుల, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణపై ఉప మిషన్ పథకం ద్వారా రైతులకు రాయితీపై పరికరాల పంపిణీకి బడ్జెట్ కేటాయించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుబాటులో ఉండనుంది. బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, రోటాటర్లు, ట్రాక్టర్ సంబంధిత పనిముట్లు, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్స్, బుష్ కట్టర్లు, పవర్ టిల్లర్, పవర్ వీడర్, స్ట్రా బేలర్, మేజ్ షెల్లర్ వంటి పరికరాలు రైతులకు అందించనున్నారు. దరఖాస్తుదారుని పేరుతో భూమి నమోదు అయి ఉండాలి. పాస్‌బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సీ (సంబంధిత పరికరాలకు) వంటి ఆధారాలు తప్పనిసరి. ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి. అరుణకుమారి సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యాంత్రీకరణ ద్వారా వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా మార్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## మిర్యాలగూడలో 'పనుల జాతర'

**– అంగన్వాడీ, పంచాయతీ భవనాలకు శంకుస్థాపనలు**




**మిర్యాలగూడ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. బంగారుకుంట తండా, మొల్కచర్ల, బెట్టె తండా, తకెళ్ళపాడు, సల్కునూరు, పాములపాడు గ్రామాల్లో నూతన అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తక్కువ సమయంలోనే పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించగలిగింది. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం గా నిలుస్తోంది" అని తెలిపారు. మారుమూల గ్రామాల్లో పౌష్టిక ఆహారం అందించేందుకు అంగన్వాడీ కేంద్రాలు కీలకమని, ప్రతి గ్రామంలో వాటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల ప్రతినిధులు, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ సాధనకు సెప్టెంబర్ 1న పోరాట సభ

## - ప్రొ. హరగోపాల్




**హైదరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెన్షన్ విద్రోహదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న పాత పెన్షన్ పోరాట సభను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు ప్రొ. హరగోపాల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. లలిత కళాతోరణం, పబ్లిక్ గార్డెన్ వేదికగా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు గళమెత్తాలని ఆయన పేర్కొన్నారు. “పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యునిఫైడ్ పెన్షన్ విధానం పాత పెన్షన్‌కు ప్రత్యామ్నాయం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సీపీఎస్‌ను రద్దు చేయాలి” అని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ప్రొ. చక్రాధర్ రావు, ప్రొ. లక్ష్మినారాయణ, చకినాల అనిల్ కుమార్, నన్నెబోయిన తిరుపతి, యం. సోమయ్య, టి. లింగారెడ్డి, వై. అశోక్ కుమార్, యం. రఘుశంకర్ రెడ్డి, వి. మనోహర్ రాజు, కిష్టప్ప, రాఘవాచారి, రవిచంద్ర, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం పాత పెన్షన్ సాధన పోరాటం కొనసాగుతుందని నేతలు స్పష్టం చేశారు.

# ధనకుంట ఆక్రమణపై తహసిల్దార్ విచారణ



**దేవరకొండ, ఆగస్టు 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్గొండ జిల్లా, డిండి మండల కేంద్రంలో 14 వ సర్వే నంబరులో ఆక్రమణకి గురైన ధనకుంట శిఖం భూమి విషయంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ , నీటి పారుదల శాఖ డి.ఈ శ్రీనివాస్, సర్వేయర్ ముత్తయ్య ల ఆధ్వర్యంలో సోమవారం నాడు విచారణ చేపట్టారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఎఫ్.టి.ఎల్ 7.10 ఎకరాలుగా తేలిందని నీటి పారుదల శాఖ డి.ఈ వెల్లడించగా స్థానిక రైతులు మండిపడ్డారు. అలుగును ధ్వంసం చేసి శిఖం భూమి మొత్తం పెద్ద పెద్ద యంత్రాలు ఉపయోగించి చదును చేసిన తరువాత అలుగును అత్యంత తక్కువ ఎత్తులో పెట్టి ఎఫ్.టి.ఎల్ గా ఫిక్స్ చేశారని, గ్రామ నక్షలో 1986వ సంవత్సరం వరకు ఉన్న పహాణిలలో 25.19 ఎకరాలను శిఖం భూమిగా స్పష్టంగా పేర్కొన్నప్పటికి నీటి పారుదల శాఖ అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై ఎఫ్.టి.ఎల్ తక్కువ విస్తీర్ణంలో ధ్రువీకరణ చేస్తున్నారని, హైకోర్టును సైతం పక్కదోవ పట్టిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 8 అడుగుల ఎత్తు ఉన్న అలుగును పూర్తిగా ధ్వంసం చేసి ప్రస్తుతం 3 అడుగులకు చేర్చారని, ప్రస్తుతం ఉన్న ధ్వంసం అయిన అలుగును బట్టి ఎలా ఎఫ్.టి.ఎల్ ఫిక్స్ చేస్తారని గ్రామస్థులు మండిపడ్డారు. ఆక్రమణదారులు ధ్వంసం చేసిన అలుగు, తూము మరియు కుంట కట్టను, వృథాగా పోతున్న వరద నీటిని పరిశీలించిన తహసీల్దార్ రెవెన్యూ రికార్డులు పరిశీలించి త్వరలో మరొక సర్వే నిర్వహించి హైకోర్టుకు నివేదిక ఇస్తామని వెల్లడించారు.

# ఎకో గణేష్ విగ్రహాల పోటీకి విద్యార్థినుల సృజనాత్మకత చాటింపు




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో ఎకో గణేష్ విగ్రహ నిర్మాణ పోటీ శనివారం ఘనంగా జరిగింది. పర్యావరణ హితం, నీటి కాలుష్య నివారణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు మట్టి, సహజ పదార్థాలతో వినాయక విగ్రహాలు తయారు చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. డి. వరలక్ష్మి, బోటనీ విభాగం ఇన్‌ఛార్జి డా. ఎన్. మనోజ్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డా. చి. విద్య తదితరులు విద్యార్థినుల సృజనాత్మకతను ప్రశంసించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఔట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు కిచ్చెన్న భరోసా



**బాలాపూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్న లక్ష్మారెడ్డిను మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగులు కలిసి తమ సమస్యలు వివరించారు. గత ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారని వారు విన్నవించారు. వెంటనే స్పందించిన కిచ్చెన్న, మున్సిపల్ కమిషనర్ నాగమణితో ఫోన్‌లో మాట్లాడి, మహిళా ఉద్యోగులకు జీతాలు చెల్లించడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో సంవత్సరాలుగా సేవలందిస్తున్న చిరు ఉద్యోగులను తొలగించకుండా, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే బాధ్యత తనదేనని కిచ్చెన్న లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగుల గోడును ఆలకించి భరోసా కల్పించిన ఆయన చర్యపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ట్యాంక్ బండ్‌పై వాటర్ బోట్ ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాటర్ బోట్‌ను జిల్లా కలెక్టర్ గారి సమక్షంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ ట్యాంక్ బండ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, “ట్యాంక్ బండ్ ప్రాంతంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, నీటిలో చిక్కుకున్నా వెంటనే స్పందించేందుకు ఈ బోట్ ఉపయోగపడుతుంది. ప్రజల ప్రాణభద్రతే మా ప్రాధాన్యం” అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ జగన్, రాఘవరావు, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, కల్యాణ్, శివాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేపట్టిన ఈ చర్యపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# జిల్లా విద్యాధికారిని సన్మానించిన హెడ్ మాస్టర్ శ్రీనివాసులు



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు, సోమవారం జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ను ఘనంగా సన్మానించారు. విద్యా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, “ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే క్రమశిక్షణతో పెరిగితేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుంది. విద్యార్థులకు నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయ బృందంతో కలిసి నిరంతరం కృషి చేస్తాను” అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు ఆనంద్ ప్రసాద్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ వంద శాతం హాజరు ఉండాలి

## - కలెక్టర్ పమేలా సత్పతి



**మానకొండూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 100 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. మానకొండూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆకస్మికంగా సందర్శించిన ఆమె, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. 8వ తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడిని ప్రశ్నించి, విద్యార్థుల ప్రతిస్పందనను పరిశీలించారు. మట్టి గణపతుల తయారీలో విద్యార్థినుల సృజనాత్మకతను అభినందించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి హాజరు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న బోధన విధానాన్ని సమీక్షించారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలు నిరంతరంగా అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్, ఎం.ఈ.ఓ మధుసూదనాచారి, ఎంపీడీవో వరలక్ష్మి, భవిత సెంటర్ ఇంచార్జి జ్యోతి, కార్యదర్శి రేవంత్ తదితరులు

# సూర్యాపేట ఇంచార్జి ఏఎస్ సిడిఓ గా శ్రీమతి కె.లత బాధ్యతలు స్వీకరణ...



**సూర్యాపేట ఆగస్టు 25, నీలగిరి ఎక్స్ ప్రెస్**
షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ సూర్యాపేట జిల్లా కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీమతి కె.లత సూర్యపేట ఇంచార్జి ఏఎస్సిడిఓ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం సూర్యాపేట ఏఎస్ సిడిఓ కార్యాలయంలో సిబ్బంది మరియు సూర్యాపేట హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ల సమక్షంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట వసతిగృహ సంక్షేమ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

# గాంధీ విగ్రహం నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు బీజేపీ పాదయాత్ర



**గంభీరావుపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించారు. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ నేతృత్వంలో గాంధీ విగ్రహం నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో, గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, “గంభీరావుపేట పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ యార్డును కూలగొట్టి మోడ్రన్ మార్కెట్ నిర్మిస్తామని చెప్పినప్పటికీ, నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు” అని విమర్శించారు. అలాగే లింగన్నపేట హై లెవెల్ బ్రిడ్జి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, కొత్తపల్లి ఎల్లమ్మ గుడి నుంచి శిలాజి నగర్ వరకు డబుల్ రోడ్డు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గడ్డమీద ప్రసాద్ రెడ్డి, వాజిద్ హుస్సేన్, గంట అశోక్, రాజేందర్ రెడ్డి, లక్ష్మీపురం రాజు గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, సర్వోత్తమ్, మల్లేష్ యాదవ్, బి. నర్సింలు, చంద్రం యాదవ్, అంజన్ రావు, దేవేందర్ యాదవ్, అరవింద్ గౌడ్, రాజేష్, రాజు, నరేష్, ఎల్లం తిరుపతి, నారా గౌడ్, రాజిరెడ్డి, నవీన్, అనిల్, బంగ్లా శ్రీధర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మహేశ్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం

## బీజేపీ నిరసన



**గంభీరావుపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. బండి సంజయ్ గెలుపు దొంగ ఓట్ల వల్లే సాధ్యమైందని చేసిన వ్యాఖ్యలు కరీంనగర్ ప్రజలను అవమానించడమేనని నేతలు మండిపడ్డారు. మహేశ్ గౌడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నాల తిరుపతిరెడ్డి, కోడె రమేశ్ సహా పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# వేరుశనగ పొట్టుతో వినాయక విగ్రహాలు

## - శ్రీజకు ప్రశంసలు




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన శ్రీజ గ్రీన్ గెలాక్సీ సంస్థ నిర్వాహకురాలు శ్రీజ వేరుశనగ పొట్టుతో తయారు చేసిన పర్యావరణహిత వినాయక విగ్రహాలను కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రదర్శించారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ పమేలా సత్పతికు ఈ విగ్రహాలను అందించిన శ్రీజ, కలెక్టర్ సూచన మేరకు సోమవారం వాటిని జిల్లాకు తీసుకువచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు విగ్రహాలను కొనుగోలు చేశారు. 9వ తరగతి నుంచే పర్యావరణ ప్రయోగాల్లో నిపుణత కనబరిచిన శ్రీజ, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కూడా కొనసాగుతోంది.

# పేరెంట్స్ కమిటీ సభ్యుడు నూకం జంగయ్యకు ఘన నివాళులు



**మంచాల, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరుట్ల గ్రామానికి చెందిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యుడు నూకం జంగయ్య గుండెపోటుతో మృతి చెందారు. జంగయ్య మృతవార్త తెలిసిన వెంటనే ఆరుట్ల హైస్కూల్ హెచ్.ఎం. గిరిధర్ ఆయన ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగయ్య స్కూల్ అభివృద్ధిలో ఎనిమిది నెలల కాలంలో చురుకైన పాత్ర పోషించారని గిరిధర్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని భగవంతుని ప్రార్థించారు. స్కూల్ తరఫున ?10,000 ఆర్థిక సహాయం అందజేశారు. నివాళుల కార్యక్రమంలో కంబాలపల్లి భాస్కర్, నూకం రాజు, చిందం శ్రీశైలం, లాలగారి జంగయ్య, జానీపాషా, దేవరాజ్, హెచ్.ఎం. మోహన్, పాపిరెడ్డి, శ్రీకాంత్, ఎండీ. జహీర్ తదితరులు పాల్గొన్నారు. జంగయ్య మృతి పట్ల గ్రామస్థులు, విద్యా వర్గాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# మహేష్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం

## చొప్పదండిలో బీజేపీ ఆందోళన



**చొప్పదండి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్పై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో మధురనగర్ చౌరస్తాలో బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేశారు. కన్వీనర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తున్న నేతపై ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ సంస్కారాన్ని బయటపెడుతున్నాయి. ప్రజాహిత యాత్ర పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు" అని విమర్శించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని మహేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు?చేరి బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుని గంగాధర, రామడుగు పోలీస్ స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మేకల ప్రభాకర్ యాదవ్, ఉప్పు రామకృష్ణ, ఎడవల్లి శశిధర్ రెడ్డి, మోడీ రవి, గాజుల మల్లేశం, బండ నరసింహ రెడ్డి, కోలా అశోక్, రేగులపల్లి రవీందర్ రెడ్డి, గుడి రవీందర్ రెడ్డి, ఎడవల్లి లక్ష్మణ్, విలాసాగర్ లచ్చయ్య, బొంగుని వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఓట్లపై మహేష్ గౌడ్ వ్యాఖ్యలు దారుణం

## ఆకుల రాజేందర్



**జమ్మికుంట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర మంత్రి బండి సంజయ్పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, "తెలంగాణలో దొంగ ఓట్ల సంస్కృతి మాది కాదు, దాన్ని ప్రోత్సహించేది కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలే" అని మండిపడ్డారు. బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి రూ.20 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. మహేష్ గౌడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో 600 మట్టి గణపతుల పంపిణీ



**కరీంనగర్, ఆగస్టు 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో 600 మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. అధ్యక్షుడు చిదర సురేష్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఓపీ విగ్రహాల వల్ల కలిగే నష్టాన్ని నివారించేందుకు మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పెద్ది విద్యాసాగర్, ముస్త్యాల రమేష్, ఎలుగూరి రవి, పల్లెర్ల శ్రీనివాస్, తొడుపునూరి హరిప్రసాద్, కన్న కృష్ణ, మంచాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలి: సీపీఎం



**నల్లగొండ ,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రైతాంగానికి అవసరమైన యూరియాను అందించి పంట పొలాలను రక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అన్నారు సోమవారం రోజు నల్లగొండ మండల ఏవో శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వం తెలంగాణకు కావలసినంత యూరియా సరఫరా చేయక వివక్ష చూపుతోందని, నెలరోజులుగా నాట్లు వేసిన రైతులు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సొసైటీలకు వచ్చిన యూరియాను అధికార పార్టీ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు స్వాధీనం చేసుకుంటున్నారని,మార్కెట్లో యూరియా బ్లాక్ మార్కెట్ ద్వారా అధిక ధరలకు విక్రయమవుతోందనిఆరోపించారు పైగా రైతులను పురుగు మందులు బలవంతంగా కొనాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని, తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం పోరాడాలని వారు డిమాండ్ చేశారు. ఖరీఫ్‌కు ముందు యూరియా స్టాక్ సరిపడా ఉందని అధికారులు చెప్పినా, ఇప్పుడు అది ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. అక్రమ నిల్వలు చేస్తున్న దళారులు, వ్యాపారస్తులపై తనిఖీలు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నడపరాజు సైదులు, మండల కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ, కొండ వెంకన్న, మానుపాటి ఎల్లయ్య ,కుడుతాల భూపాలు ,వెంకన్న ,నరసింహ ,రాములు తదితరులున్నారు.

# తిప్పర్తి మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ఎన్నికల ఉత్సాహం







**తిప్పర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిప్పర్తి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు సోమవారం ఉత్సాహభరితంగా జరిగాయి. ప్రిన్సిపల్ ఏ. అపర్ణ నేతృత్వంలో 27 మంది విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేసి పోటీలో పాల్గొన్నారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో విద్యార్థులే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులుగా వ్యవహరించడం విశేషం. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మండల విద్యాధికారి నరసింహ నాయక్ మాట్లాడుతూ, "ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరిగాయి. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇది మంచి వేదిక" అని ప్రశంసించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం, తల్లిదండ్రులను భాగస్వాములుగా చేర్చడం ద్వారా పాఠశాల అభివృద్ధికి తోడ్పడతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.

# యూరియా కొరతపై తిప్పర్తిలో సిపిఎం ధర్నా



**తిప్పర్తి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నన్నూరి వెంకటరమణారెడ్డి విమర్శించారు. తిప్పర్తి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అగ్రికల్చర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. విత్తనాలు వేసి నెలరోజులు గడిచినా యూరియా అందకపోవడంతో పంటల ఎదుగుదలపై ప్రభావం, దిగుబడిలో నష్టం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు తెల్లవారుజామున నుంచే లైన్లలో నిలబడుతున్నా ఎరువు అందకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆంక్షలు లేకుండా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే రైతులను ఏకం చేసి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మన్యం బిక్షం, గండమల్ల రాములు, ఆకిటి లింగయ్య, జంజరాల సైదులు, మైలా సైదులు, పోకల ఝాన్సీ, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 328 దరఖాస్తులు

## కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 328 దరఖాస్తులు అందాయి. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని సంబంధిత అధికారులకు బదిలీ చేస్తూ తక్షణ పరిష్కారం కల్పించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అర్హులైన వారికి అవకాశమివ్వాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో బాలికలు, మహిళలు, దివ్యాంగులు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# పేదలకు అధునాతన వైద్యం అందించడమే లక్ష్యం

## మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేదవారికి కూడా ధనవంతుల మాదిరిగా అధునాతన వైద్య సదుపాయాలు అందించడమే తన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపిక్ యూనిట్‌ను పద్మ విభూషణ్ డా. నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంత ప్రజలకు మెట్రో స్థాయి వైద్యం అందించేందుకు ఈ యూనిట్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించేందుకు నా కృషి కొనసాగుతుంది" అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, వైద్య అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్: ఇలా త్రిపాఠి



**నల్లగొండ ,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా నలుమూలల నుండి ప్రజలు ఫిర్యాదులను సమర్పిస్తారని, అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను ఫిర్యాదు దారుకు తెలియజేయాలని చెప్పారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం వల్ల ఫిర్యాదుదారులకు మేలు జరుగుతుందని అన్నారు.జిల్లా స్థాయిలో పరిష్కారం కాని వాటిని పై స్థాయికి పంపించాలని, ఆ విషయాన్ని ఫిర్యాదుదారుకు తెలియజేయాలని చెప్పారు. ప్రజావాణి ఫిర్యాదులతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులను కూడా సకాలంలో పరిష్కరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎక్కడ జాప్యం చేయొద్దని, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఇదే వరవడిని కొనసాగించాలని చెప్పారు.

# టీ ఏడ్- ఏడ్ చేతిరాత పోటీకి విద్యార్థుల ఉత్సాహభరిత స్పందన



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీ ఏడ్- ఏడ్ కార్యక్రమంలో భాగంగా ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషలో చేతిరాత మండల స్థాయి పోటీలు కరీంనగర్ రూరల్ ఎంఆర్సీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా, మండల విద్యాధికారి కే. రవీందర్ మాట్లాడుతూ, "ఇలాంటి పోటీలు జిల్లా స్థాయిలో ఎక్కడా జరగలేదు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది" అని పేర్కొన్నారు. విద్యార్థుల ఆంగ్ల భాష పరిజ్ఞానం, సృజనాత్మకత పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కందుకూరి శ్రీనివాస్ ఎస్ఏ కన్వీనర్‌గా, ఆదయ్య ఎస్ఏ కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికై పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**శాలువా కప్పి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి**



**నల్లగొండ ,ఆగస్ట్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు భూపాల్ రెడ్డి జన్మదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు కార్యకర్తలు వివిధ రకాల పండ్లతో ఏర్పాటుచేసిన గజమాలను క్రేను సహాయంతో అలంకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు అనంతరం కేక్ కట్ చేసి శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు గ్రామాల్లో కేక్ కటింగ్ లు ఆలయాల్లో పూజలు పండుగ వాతావరణం నెలకొంది తమ అభిమానులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు గిరిజనుల డాన్సులు, కోలాట బృందాల విన్యాసాలు,బ్యాండ్ మేళాలతో బాణాసంచా పేలుళ్లతో అట్టహాసంగా స్వాగతం పలికారు కంచర్లపై అభిమానంతో వందలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో వేదికపై మూడు గంటలకు పైగా.. ఓపికతో నిలబడి అందరి అభినందనలు అందుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు రవీంద్ర కుమార్,జెడ్పిమాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు, బడుగుల లింగయ్య యాదవ్, మాజీ శాసనసభ్యులు, గాదరి కిషోర్ కుమార్ నల్లమోతు భాస్కరరావు, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్ కుమార్, రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చకిలం అనిల్ కుమార్, హుజూర్నగర్ పార్టీ ఇంచార్జ్ వంటెద్దు నరసింహారెడ్డి, కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు కటికం సత్తయ్య గౌడ్, చీర పంకజ్ యాదవ్ , కరీం పాషా అయితే గాని యాదయ్య తదితరులు శుభాకాంక్షలు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## భూదేవి హిల్స్ డి-2 కాలనీ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి కృషి



**జగద్గిరిగుట్ట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భూదేవి హిల్స్ డి-2 బ్లాక్‌లో సిసి రోడ్డు మంజూరు చేసి నిర్మాణ పనులను పర్యవేక్షించిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. కాలనీ సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న బాధ్యతాయుతమైన సేవా దృక్పథం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.శాలువాతో సన్మానించిన కాలనీవాసులు, "శ్రీకాంత్ రెడ్డికి మా పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని తెలిపారు. కార్యక్రమంలో కావలి చెన్నయ్య, తిరుమల్ రెడ్డి, శ్రీను నాయక్, డాక్టర్ అంజన్న గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కే గార్డెన్స్‌లో జనహిత పాదయాత్ర సభ

**- కాంగ్రెస్ శ్రేణులకు ఉత్సాహం**



**చొప్పదండి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జనహిత పాదయాత్రలో భాగంగా ఎల్కే గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు టీపీసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ, "ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జనహిత పాదయాత్ర ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, "కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్. ఈ పాదయాత్ర ప్రతి ఇంటికీ పార్టీ ఆలోచనలను చేర్చే వేదికగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు నియోజకవర్గాల కార్యకర్తలు, యువజన నాయకులు, ఎన్ఎస్యూఐ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

## గంగాధర బాలుర వసతి గృహంలో శ్రమదాన కార్యక్రమం



**గంగాధర, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జనహిత రెండవ విడత పాదయాత్రలో భాగంగా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలంలో సోమవారం ఉదయం బాలుర వసతి గృహంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్, ఇతర కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.నాయకులు పరిశుభ్రత పనుల్లో స్వయంగా పాల్గొని, అనంతరం వాల్ పెయింటింగ్, మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించారు. "శ్రమదానం ద్వారా ప్రజల్లో సేవాభావం పెంపొందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం" అని నేతలు తెలిపారు.

## అచ్చంపేటకు నేడు మందకృష్ణ మాదిగ రాక



**అచ్చంపేట, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చేయూత పింఛన్ సన్నాహక సదస్సులో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేడు అచ్చంపేటకు రానున్నారు. పటేల్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ఈ సమావేశంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, పెన్షన్ దారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కుల సంఘ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగార్జున మాదిగ, సౌటా కాశీం, జిలకర సాంబశివరావు, మంద వెంకటయ్య, అంతటి రామకృష్ణ తదితరులు పాల్గొననున్నారు. సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## హుస్నాబాద్‌లో మహేష్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం



**హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ నేతృత్వంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. "ఇది ప్రజాహిత యాత్ర కాదు, పిచ్చి యాత్ర" అంటూ బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహేష్ గౌడ్ కరీంనగర్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమాన్‌పూర్‌లో ప్రభుత్వ కార్యాలయాల పని తీరుపై బీజేపీ పరిశీలన



**కమాన్‌పూర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతీయ జనతా పార్టీ కమాన్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి స్థానిక సమస్యలను గుర్తించారు. మండల అధ్యక్షుడు కోయడ సతీష్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెటర్నరీ హాస్పిటల్, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలను పరిశీలించారు. వెటర్నరీ హాస్పిటల్‌లో సిబ్బంది కొరత, సీజనల్ వ్యాధుల మందుల లేమి, నీటి సరఫరా సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అంగన్వాడి కేంద్రంలో నీటి సమస్య, పరిసరాల్లో గడ్డి పెరిగి చిన్నారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో శానిటైజేషన్, డ్రైనేజీ క్లీనింగ్, దోమల నివారణ చర్యలు లేకపోవడం వల్ల విష జ్వరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ మాత్రలు, ఎలర్జీ, దురదలకు సంబంధించిన మందుల లేమిపై డాక్టర్‌ను కలిసి, డిఎంహెచ్వోకు లేఖ రాసి మందులు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని మండల బీజేపీ నేతలు పేర్కొన్నారు. తక్షణమే నిధులు విడుదల చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చగిరి రాము, మట్ట శంకర్, ఇరుగురాల పోషం, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, బర్ల సదానందం, పంతగాని విశ్వతేజ, పెద్దపల్లి శ్యాంసుందర్, గట్టు శ్రీనివాస్, పిల్లి చంద్రయ్య, మోర ప్రశాంత్, పిడుగు రమేష్, ఆసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో కాంగ్రెస్ నేతలకు ఘన స్వాగతం



**హనుమకొండ, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జనహిత పాదయాత్ర సందర్భంగా హనుమకొండకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్కు పూల బొకేలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. స్వాగత కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గుండు సుధారాణి, తోట వెంకన్న, అజిజ్ ఖాన్, శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేయండి

**- బీజేపీ ధర్నా**



**సంగారెడ్డి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిన్నారం గ్రామంలో భూ సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో మహా ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు జగన్ రెడ్డి నేతృత్వంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. 180 ఎకరాల భూమి విషయంలో 600 గజాల హెచ్ఎండీ లేఔట్ ఇవ్వాలన్న డిమాండ్‌తో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ రావు, దేశ్ పాండే, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చొప్పదండిలో జనహిత పాదయాత్రకు ప్రజల విశేష స్పందన



**చొప్పదండి, ఆగస్టు 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర ఉప్పర్ మల్యాల్ నుండి గంగాధర మధురనగర్ చౌరస్తా వరకు విజయవంతంగా కొనసాగింది. ఈ పాదయాత్రలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రి డా. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, స్థానిక ప్రజలతో కలసి నడుస్తూ వారి సమస్యలను నేరుగా విని, సానుభూతితో స్పందించడం విశేషంగా ఆకట్టుకుంది. పాదయాత్ర ప్రారంభంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి, గంగాధర మధురనగర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో నాయకులు ప్రజలను ఉద్దేశించి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రసంగించారు.సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రాంతీయ నాయకులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొనడంతో పాదయాత్ర ఉత్సాహభరితంగా, ప్రజల మద్దతుతో సాగింది.

# పారడైజ్ పాఠశాలలో మట్టి గణపతుల పంపిణీ




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రేకుర్తి పారడైజ్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తల్లిదండ్రులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కరీంనగర్ ఫిలిం భవన్ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పి. ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ, "మట్టి గణపతిని పూజించి ప్రకృతిని కాపాడుకోవాలి" అని తల్లిదండ్రులకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీ. వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల మంజూరుకు కృషి చేసిన రాజ్ ఠాకూర్‌కు ధన్యవాదాలు తెలిపిన మల్లేష్



**రామగుండం, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్ పీకే రామయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో 150 మంది లబ్ధిదారులకు తెల్ల రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాలతో ఈ ప్రక్రియ జరిగిందని డివిజన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ తెలిపారు. పది సంవత్సరాలుగా రేషన్ కార్డులపై నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు, సన్న బియ్యం అందుతోందని మల్లేష్ పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి రాజ్ ఠాకూర్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష చేసిన కృషికి డివిజన్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గుర్రాల మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# జనహిత పాదయాత్రపై బీజేపీ ఘాటుగా స్పందన

మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, "చీకటి పడ్డాక యాత్ర చేయడం హాస్యాస్పదం. ప్రజా సమస్యలు తెలుసుకోవాలంటే ఎండలో ప్రజల మధ్యకి వెళ్లాలి" అని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్పై చేసిన వ్యాఖ్యలను దుర్మార్గంగా అభివర్ణిస్తూ, "ఇది కరీంనగర్ ప్రజల అవమానమే" అని పేర్కొన్నారు. "రెండు లక్షల మెజారిటీతో గెలిచిన నాయకుడిపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు" అని అన్నారు. బీసీలపై కాంగ్రెస్ పార్టీ వ్యవహారం, రిజర్వేషన్లలో ముస్లింలకు ప్రాధాన్యత, ఎంఐఎం పార్టీతో పొత్తు వంటి అంశాలపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. "బండి సంజయ్ నాయకత్వంలో కరీంనగర్ అభివృద్ధి చెందుతోంది. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం" అని హెచ్చరించారు. గీత భవన్ చౌరస్తా వద్ద మహేష్ గౌడ్ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం ద్వారా బీజేపీ కార్యకర్తలు తమ నిరసనను వ్యక్తం చేశారు.

## ప్రణవ్ నివాసానికి కాంగ్రెస్ అగ్రనేతలు



**హుజూరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల ముందు జనహిత పాదయాత్ర కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. చొప్పదండి నియోజకవర్గం నుంచి వరంగల్ వర్ధన్నపేట వైపు పయనించే క్రమంలో, హుజూరాబాద్ మండలం సింగాపూర్ వద్ద వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తదితరులకు ఘన స్వాగతం పలికారు. సింగాపూర్ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రణవ్ నివాసం వరకు ర్యాలీగా వెళ్లిన నేతలు, అక్కడ అల్పాహారం తీసుకొని కార్యకర్తలకు అభివాదం తెలిపారు. ఈ పర్యటనతో హుజూరాబాద్ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. రాబోయే ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు సాధించేందుకు కృషి చేయాలని, ప్రజా పథకాలను బలంగా ప్రచారం చేయాలని నేతలు సూచించారు.

# కరీంనగర్‌లో నానో యూరియా పై అవగాహన

- ఎరువుల డీలర్ల సమావేశం



**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఎరువుల డీలర్ల సమావేశంలో, నానో యూరియా వాడకంపై విస్తృత చర్చ జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, వరి పంట పిలుక, పొట్ట దశల్లో ఉన్న నేపథ్యంలో నానో యూరియా పిచికారి అత్యవసరం అని సూచించారు. ఒక 500 ఎంఎల్ నానో యూరియా బాటిల్, సంప్రదాయ యూరియా బస్తాకు సమానం అని, ధర తక్కువ, రవాణా సులభం, ఆకులు సమగ్రంగా నత్రజని గ్రహించి అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. ఇఫ్కో, కోరమండల్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, నానో యూరియాను 30 రోజుల తర్వాత పిచికారి చేయడం వల్ల, 12 రోజుల పాటు నత్రజని ప్రభావం ఉంటుందని, చీడపీడల ప్రభావం తగ్గుతుందని, పురుగుమందులో కలిపి కూడా వాడవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ సహాయ సంచాలకులు కే. రణధీర్ కుమార్, వ్యవసాయ అధికారులు హరిత, కృష్ణ, సత్యం, పిఎసిఎస్, డీసీఎంఎస్, ఆగ్రోస్ ప్రతినిధులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో బీ.పి. మండల్ 107వ జయంతి వేడుకలు ఘనంగా



**హుస్నాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీ.పి. మండల్ 107వ జయంతిని బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. 1978లో మొరార్జీ దేశాయ్ హయాంలో బీ.పి. మండల్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మండల్ కమిషన్, దేశవ్యాప్తంగా బీసీ సామాజిక వర్గం సమస్యలపై 40 అంశాలతో నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా వీ.పి. సింగ్ ప్రభుత్వం ఉద్యోగ, విద్య రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది. అయితే ఇంకా 39 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని నేతలు గుర్తుచేశారు. బీసీల హక్కుల కోసం పోరాడిన నేతలుగా శరత్ పవార్, లల్లూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్, కాన్సిరాం పాత్రను గుర్తిస్తూ, బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నిర్లక్ష్యం చేశాయని విమర్శలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో పచ్చిమట్ల రవీందర్ గౌడ్, మారెపల్లి సుధాకర్, ఎలగందుల శంకర్, వేల్పుల రాజు, మొగిలిపాక శ్రీను, దేవేందర్ తదితర బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

## వనపర్తి పట్టణంలో సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ




**వనపర్తి,ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని పాలమూరు ప్రముఖ వైద్యుడు, ప్రజాసేవకుడు డాక్టర్ జిల్లెల మాధవరెడ్డికి అంకితం చేశారు. అనంతరం సురవరం ప్రతాపరెడ్డి, మాధవరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుస్తక రచయిత ఆచార్య గంటా జలంధర్ రెడ్డి గారిని చిన్నారెడ్డి శాలువా, షీల్డ్‌తో సన్మానించగా, మాధవరెడ్డి కుమార్తె జిల్లెల శిల్పని కూడా సన్మానించారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ "పత్రికా సంపాదకునిగా, కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, ఉద్యమకారుడిగా, బహుభాషా పండితునిగా సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ అపూర్వం. ఆంధ్ర కవి విమర్శకు సమాధానంగా 354 మంది కవులతో గోల్కొండ కవుల సంచిక రచించారు. నిజాం రాజుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేశారు. 1952లో వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి మొదటి ఎమ్మెల్యేగా సేవలందించారు. 1955లో ఆయన రచించిన ఆంధ్రుల సామాజిక చరిత్రకు కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు లభించింది. తెలుగు జాతి, భాష కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసింది" అని పేర్కొన్నారు. అలాగే, "సురవరం ఆదర్శంగా తీసుకుని అవినీతి రహితంగా స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తున్నాను. మా అన్న డాక్టర్ మాధవరెడ్డి పేదలకు ఉచిత వైద్యం చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గ్రంథాన్ని ఆయనకే అంకితం చేస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, విద్యావంతులు, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోరీ వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందన



**హుజూరాబాద్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన "ఓట్ చోరీ" వ్యాఖ్యలపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా స్పందించారు. "ఇలాంటి వ్యాఖ్యలు కరీంనగర్ ప్రజలను అవమానించడమే" అని పేర్కొంటూ, బహిరంగ క్షమాపణ కోరారు. జనహిత పాదయాత్రను 'జనద్రోహ పాదయాత్ర'గా అభివర్ణించిన ఆయన, "20 నెలల పాలనలో కాంగ్రెస్ ఏ అభివృద్ధి చూపించలేక బీజేపీపై దుష్ప్రచారం చేస్తోంది" అని విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి వేల కోట్ల నిధులు తీసుకువచ్చారని, ప్రజలు ఆయనపై పూర్తి విశ్వాసం ఉంచారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, ముస్లింలకు లాభం చేకూర్చే కుట్రలు, హిందువులపై దాడులపై మౌనం వంటి అంశాలపై మహేష్ గౌడ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. "ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి ఆయనకు నైతిక అర్హత లేదు" అని గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో ఎర్రబెల్లి సంపత్ రావు, నరసింహ రాజు, తూర్పాటి రాజు, గంగిశెట్టి రాజు, యాళ్ళ సంజీవ రెడ్డి, గంగిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై విద్యార్థి పోరు బాట ప్రారంభం



**గోదావరిఖని, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి పోరు బాట ప్రారంభమైంది. సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ జెండా ఊపి జీపు యాత్రకు శ్రీకారం చుట్టారు. పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, "ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల ప్రైవేటు విద్యాసంస్థలు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, టీచర్ పోస్టుల ఖాళీలు విద్యా వ్యవస్థను కుంగదీస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, విద్యాశాఖ మంత్రి నియామకం, ఎంఈఓ, డిఈఓ పోస్టుల భర్తీ, 8000 కోట్ల పెండింగ్ ఫీజుల విడుదల వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి, అనూజ, కమలేష్, రాము, శివ తదితర పిడిఎస్యు నాయకులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో కాంగ్రెస్ బలోపేతానికి భారీ చేరికలు



**పెద్దపల్లి, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడేలా కృషి చేయాలని, గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా పార్టీ ప్రతిష్టను పెంపొందించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఎమ్మెల్సీ తానుపర్తి భాను ప్రసాద్ రావు పిలుపునిచ్చారు. గర్రెపల్లి, సుల్తానాబాద్, ఎలిగేడు, కాల్వ శ్రీరాంపూర్ మండలాల నుంచి బీఆర్ఎస్, బీజేపీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కలలను సాకారం చేస్తోంది" అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు మాట్లాడుతూ, "తెలంగాణ సాధనలో తన పాత్రను గుర్తు చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పని చేస్తానని" తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగుల 'జంగ్ సైరన్' పోస్టర్ ఆవిష్కరణ




**కరీంనగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాత పెన్షన్ పునరుద్ధరణ సహా ఉద్యోగుల సమస్యలపై 'జంగ్ సైరన్' ఉద్యమానికి టీజీఈ జేఏసీ శ్రీకారం చుట్టింది. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ నేతృత్వంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం, 9న చైతన్య సదస్సు, అక్టోబర్ 12న చలో హైదరాబాద్ కార్యక్రమాలకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పీఆర్సీ, డీఏలు, బిల్లుల పెండింగ్, హెల్త్ స్కీమ్ నిలిపివేత వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఉద్యోగుల గళం వినిపించకపోతే, ప్రజలకు అసౌకర్యానికి పాలకులే బాధ్యతవహించాలి అని హెచ్చరించారు.

బిజినెస్

# పసిడి ప్రియులకు బిగ్ రిలీఫ్..



బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. ప్రపంచ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మధ్య స్టాకిస్టులు అమ్మకాలు జరుపడంతో ధరలు స్వల్పంగా దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల బంగారంపై రూ.200 తగ్గి తులం ధర రూ.1,00,170కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అలాగే, 22 క్యారెట్ల పసిడి ధర రూ.150 తగ్గి రూ.99,900కి తగ్గింది. అదే సమయంలో వెండి ధరలు కిలోకు రూ.1,15,000 వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి.ప్రపంచ మార్కెట్లలో న్యూయార్క్‌లో బంగారం 0.26 శాతం తగ్గి ఔన్సుకు 3,363.45కి డాలర్లకు చేరింది. వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు పెరగడంతో సానుకూల ధోరణిని కలిగి ఉంటుందని భావిస్తున్నారని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ అండ్ కరెన్సీ హెడ్ ప్రవీణ్ సింగ్ పేర్కొన్నారు. స్పాట్ సిల్వర్ కూడా 0.17 శాతం తగ్గి ఔన్సుకు 38.78 డాలర్లకు చేరింది. మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి మాట్లాడుతూ.. గత వారం జాక్సన్ హెూల్ సింపోజియంలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలతో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. డిసెంబర్ తర్వాత సెంట్రల్ బ్యాంక్ త్వరలో తొలిసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని పావెల్ పేర్కొన్నారు. రాబోయే యూఎస్ ఫెడరల్ రిజర్వ్ FOMC సమావేశం సెప్టెంబర్ 16-17 తేదీల్లో జరుగనున్నది. అయితే, నిరంతర ద్రవ్యోల్బణ ఆందోళనలు, మందగించిన ఆర్థిక కార్యకలాపాలు దూకుడు వడ్డీ రేటు కోతలకు దారితీయకపోవచ్చని కలాంత్రి పేర్కొన్నారు. దాంతో బంగారం లాభాలను అడ్డుకునే అవకాశం ఉందన్నారు. పెట్టుబడిదారులు రెండవ త్రైమాసికానికి సంబంధించిన ప్రైమరీ యూఎస్ జీడీపీ డేటాను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలిస్తారని ఆగ్‌మాంట్ పరిశోధన విభాగాధిపతి రెనిషా పేర్కొన్నారు. ఈ డేటా గురువారం విడుదల కానున్నది. ఇది ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి, బులియన్ సెంటిమెంట్ గురించి అంచనాలు తెలిసే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం రూ.1,01,510 ఉండగా.. 22 క్యారెట్ల పసిడి రూ.93,050గా ఉన్నది. కిలో వెండి రూ.1.31లక్షల ధర పలుకుతున్నది.

## ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు..
## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



భారత స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలున్నాయి. ఐటీ స్టాక్స్‌లో భారీ కొనుగోళ్లు జరిగాయి. దాంతో మార్కెట్లు వారంలో తొలిరోజు లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,501.06 వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,364.86 పాయింట్ల కనిష్టాన్ని చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,799.06 పాయింట్ల గరిష్టానికి పెరిగింది. చివరకు 329.05 పాయింట్లు పెరిగి.. 81,635.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 97.65 పాయింట్లు పెరిగి 24,967.75 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, సన్ ఫార్మా, మారుతి, టైటాన్ లాభపడ్డాయి.భారత్ ఎలక్ట్రానిక్స్, ఆసియన్ పెయింట్స్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రంగాల వారీగా చూస్తే.. ఐటీ ఇండెక్స్ 2.3శాతం పెరిగింది. రియాలిటీ ఇండెక్స్ 0.7శాతం వృద్ధిని నమోదు చేసింది. మెటల్ ఇండెక్స్ 0.6శాతం పెరిగాయి. ఆసియా మార్కెట్లలో, దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ సానుకూల లాభాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ట్రేడవుతున్నాయి. శుక్రవారం యూఎస్ మార్కెట్లు బాగా పెరిగాయి. సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేటు తగ్గింపు, యూఎస్‌లో వడ్డీ రేటు తగ్గుతుందనే అంచనాలు దేశీయ మార్కెట్లో ఆశావాదం నెలకొందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ పరిశోధనా అధిపతి వినోద్ నాయర్ పేర్కొన్నారు.

# గుడ్‌న్యూస్ చెప్పిన ఫ్లిప్‌కార్ట్..

### పండుగ సీజన్‌లో కొత్తగా 2 లక్షలకుపైగా తాత్కాలిక ఉద్యోగాలు




ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ శుభవార్త చెప్పింది. రానున్న పండుగ సీజన్ ను దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు ప్రకటించింది. తన వార్షిక మెగా సేల్ 'ది బిగ్ బిలియన్ డేస్' కోసం దేశవ్యాప్తంగా కొత్తగా 2 లక్షలకు పైగా తాత్కాలిక ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించింది.పండుగల సీజన్ వస్తోంది. ఆగస్టు 27న వినాయక చవితి, సెప్టెంబరు 22 నుంచి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత దసరా, దీపావళి ఇలా వరుస పండుగలు ఉన్నాయి. ఏటా పండుగల సీజన్‌లో ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌ను ప్రకటిస్తుందన్న విషయం తెలిసిందే. పండుగ సీజన్‌లో తక్కువ ధరకే పలు వస్తువులను సేల్‌కు పెడుతుంది. దీంతో ఆ సమయంలో పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తుంటాయి. వాటిని కస్టమర్లకు సకాలంలో డెలివరీ చేసేందుకు మానవ వనరులు అవసరం ఏర్పడుతుంది. అందుకోసం ఏటా పండుగల సీజన్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంటుంది. ఈ ఏడాది కూడా దేశవ్యాప్తంగా దాదాపు 28 రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సోమవారం ప్రకటించింది. 2.2 లక్షల సీజనల్ ఉద్యోగఅవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా టైర్-2, టైర్-3 నగరాల్లోని యువతకు ఉపాధి కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పేర్కొంది. కంపెనీ ప్రకారం.. ఈ నియామకాలు ప్రధానంగా సప్లైచైన్, లాజిస్టిక్స్, లాస్ట్-మైల్ డెలివరీ వంటి విభాగాల్లో ఉండనున్నాయి. మొత్తం నియామకాల్లో 15 శాతం మంది మొదటిసారి ఉద్యోగంలో చేరుతున్న వారే. ప్యాకర్స్, పికర్స్, సార్టర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్‌ల కోసం నియామకాలు జరగనున్నాయి. గతేడాదితో పోలిస్తే మహిళలు, వికలాంగులు (పీడబ్ల్యూడీ), ఎల్జీబీటీక్యూఐఏ వర్గాల వారికి అధికంగా అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ తన ప్రకటనలో వివరించింది.

# హాల్ ఆఫ్ ఫేమ్'లో మాజీ సారథి..
## సిడ్నీలో నిలువెత్తు విగ్రహం..!



ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ బెలిండా క్లార్క్ కు అరుదైన గౌరవం లభించింది. ఆ దేశంలో మహిళా క్రికెట్ అభివృద్ధికి, ప్రచారానికి విశేషమైన కృషి చేసిన క్లార్క్‌కు 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కింది. ఆమెకు లెజెండ్ హెూదాను ప్రదానం చేసిన ఆసీస్ బోర్డు.. సిడ్నీ క్రికెట్ మైదానంలో క్లార్క్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఘనత సాధించిన ఆరో ఆసీస్ క్రికెటర్ బెలిండా. ఆమె కంటే ముందు డొనాల్డ్ బ్రాడ్‌మన్, కీత్ మిల్లర్, రిచీ బెనాడ్, డెన్నిస్ లిల్లీ, షేన్ వార్నర్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం సంపాదించారు. అయితే.. తొలి మహిళా క్రికెటర్ మాత్రం బెలిండానే కావడం విశేషం.ఆస్ట్రేలియా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కడం చాలా గొప్ప గౌరవం. నాకు లెజెండ్ స్టేటస్ రావడాన్ని నమ్మలేకపోతున్నా. దేశానికి సేవ చేసిన దిగ్గజ ఆటగాళ్ల సరసన నా పేరు ఉండడంతో సంతోషం ఉంది. ఒకింత గర్వంగా అనిపిస్తోంది. మరోవైపు కృతజ్ఞతాభావం కూడా మనసులో నిండింది. నేను సమిష్టితత్వం కలగలసిన ఆటతో పేరు సాధించాను. జట్టులోని సభ్యుల సహకారం, పోరాటపటిమ లేకుండా మనం ఏదీ సాధించలేం. నాకు ఈ ఘనత దక్కడంలో తమ పాత్ర ఉందని కోచ్‌లు, సహాయక సిబ్బంది, క్రికెట్ ఆస్ట్రేలియా అధికారులు సంతోషిస్తారు' అని బెలిండా క్లార్క్ తెలిపింది.సారథిగా ఆసీస్ మహిళా టీమ్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లింది బెలిండా. ఆమె నేతృత్వంలో 101 వన్డేల్లో ఏకంగా 83 మ్యాచుల్లో గెలిచింది కంగారూ టీమ్. బ్యాటర్‌గా గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన ఆమె వన్డేల్లో 47.49 సగటు, టెస్టుల్లో 45.95 సగటుతో అత్యధిక సగటుతో రాణించింది. అంతేకాదు డబుల్ సెంచరీ బాదిన తొలి మహిళా క్రికెటర్ కూడా ఆమెనే. 1997 వరల్డ్ కప్‌లో బెర్ముడాపై 229 పరుగులతో అజేయంగా నిలిచింది బెలిండా.బెలిండా మా దేశంలో మహిళా క్రికెట్‌కు ఆమె చుక్కాని. తను అద్భుతమైన బ్యాటర్. అప్పటి వరకూ సంప్రదాయ క్రికెట్ ఆడుతున్న మా జట్టుకు దూకుడు నేర్పింది. బౌలర్లపై విరుచుకుపడడం ఎలానో చూపించింది బెలిండా. ప్లేయర్‌గా, కెప్టెన్‌గా తన ముద్ర వేసింది. ఆమె నాయకత్వ పటిమ.. యువతరంపై ఆమె చూపిన ప్రభావం చిరస్థాయిగా నిలిచిపోతాయి' అని బెలిండాను హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపిక చేసిన కమిటీ అధ్యక్షులు బ్రుసే మెక్అవనే వెల్లడించారు.

# టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకున్న డ్రీమ్11.

## ధ్రువీకరించిన బీసీసీఐ..!




టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్11 తప్పుకుంది. బీసీసీఐతో జరిగిన రూ.358కోట్ల ఒప్పందం నుంచి గడువుకు ముందు అర్ధాంతరంగా డ్రీమ్11 రద్దు చేసుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఒప్పందం నుంచి వైదొలగాలని ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ నిర్ణయించుకుంది. బీసీసీఐతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న విషయాన్ని బీసీసీఐ ధ్రువీకరించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ 2025 ఆమోదం నేపథ్యంలో ఒప్పందం ముగిసిందన్నారు. భవిష్యత్‌లో ఆ సంస్థతో బీసీసీఐకి ఒప్పందం ఉండదన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల డ్రీమ్ 11 ప్రతినిధులు బీసీసీఐ కార్యాలయానికి చేరుకొని టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా ఇకపై కొనసాగలేమని సీఈవో హేమంగ్ అమీన్ అధికారికంగా బీసీసీఐకి వెల్లడించారు.ఒప్పందం రద్దయిన నేపథ్యంలో రాబోయే ఆసియా కప్‌లో భారత జట్టు డ్రీమ్ 11 లోగో లేకుండానే మైదానంలోకి దిగబోతున్నది. బీసీసీఐ త్వరలోనే కొత్త స్పాన్సర్ కోసం టెండర్ జారీ చేసే అవకాశం ఉంది. బైజు స్థానంలో 2023లో బీసీసీఐ స్పాన్సర్ హక్కులను డ్రీమ్ 11 సొంతం చేసుకుంది. ఈ స్పాన్సర్ ఒప్పందం విలువను రూ..358 కోట్లుగా నిర్ణయించారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ నిర్ణయం భారతదేశంలో క్రికెట్ నియంత్రణ మండలిపై మాత్రమే కాకుండా క్రీడా ప్రపంచంపై ప్రభావం కనిపించనున్నది. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు స్పాన్సర్‌గా ఉంది. డ్రీమ్ 11కు పలువురు క్రికెటర్లు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారు. ఇందులో మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా వంటి అగ్ర క్రికెటర్లు ఈ జాబితాలో ఉన్నారు. 2020లో భారత్-చైనా మధ్య ఉద్రిక్తతల సమయంలో వీవో ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను వదులుకున్న సమయంలో డ్రీమ్11 కొంతకాలం టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. తాజాగా డ్రీమ్11 అకస్మాత్తుగా స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకోవడం బీసీసీఐకి ఇబ్బందికరంగా మారింది. కొత్త స్పాన్సర్‌ను వెతికిపట్టుకోవడం సవాల్‌గా మారింది. అయితే, దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లు, ఆటగాళ్లపై కనిపించనున్నది. ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్ రెండోవారం చివరలో మొదలుకానున్నది. దాంతో బీసీసీఐకి స్పాన్సర్స్‌ను తక్కువ సమయంలో వెతకాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆటగాళ్ల జెర్సీలపై లోగో కనిపించదు. ఇది బ్రాండ్ విలువ, ఆదాయం రెండింటిని ప్రభావితం చేయనున్నది. 2020లో వివో వైదొలిగిన తర్వాత డ్రీమ్-11 ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌గా వ్యవహరించిన సమయంలో ఇదే పరిస్థితి నెలకొంది. డ్రీమ్ 11 ఈ కంపెనీ అనేక ఐపీఎల్ ఫ్రాంచైజీలకు, అనేక మంది స్టార్ ఆటగాళ్లకు స్పాన్సర్‌గా ఉంది. కరేబియన్ ప్రీమియర్ లీగ్ భాగస్వామి.

స్పోర్ట్స్

## వీడ్కోలుపై యూటర్న్..
## వరల్డ్ కప్ క్యాంప్‌లో మాజీ కెప్టెన్..!




అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడం.. ఆ తర్వాత కొద్ది రోజులకే యూటర్న్ తీసుకుంటున్నారు కొందరు. దేశం కోసమని.. తొందరపడి రిటైర్మెంట్ ఇచ్చామని కారణాలు చెబుతూ మళ్లీ మైదానంలోకి దిగుతున్నారు. తాజాగా దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డేన్‌వాన్ నీకెర్క్ సైతం వీడ్కోలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈమధ్యే దేశవాళీ క్రికెట్‌తో పునరాగమనం చేసిన 32 ఏళ్లున్న నీకెర్క్ వరల్డ్ కప్ సన్నాహక క్యాంప్‌లో చోటు దక్కించుకుంది ఆల్‌రౌండర్.రెండేళ్ల క్రితం నీకెర్క్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో చోటు లభించలేదనే కోపంతో ఆటకు అల్విదా చెప్పేసిందామె. అయితే.. ఫిట్‌నెస్ నిరూపించుకోలేకనే ఆమె ఎంపికవ్వలేదు. ఈ విషయాన్ని అంగీకరించిన నీకెర్క్ ఇప్పుడు వన్డే వరల్డ్ కప్ సమీపిస్తున్న వేళ యూటర్న్ తీసుకొంది. 'వీడ్కోలు వెనక్కి తీసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. వస్తూ వస్తూనే వరల్డ్ కప్ సన్నద్ధత శిబిరంలో చోటు దక్కించుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది. దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని ఎంతగా మిస్ అయ్యానో నాకు కాలం గుర్తు చేసింది. అవకాశం రావాలేగానీ మరోసారి దక్షిణాఫ్రికా జెర్సీతో చెలరేగి ఆడేందుకు సిద్ధంగా ఉన్నాను' అని నీకెర్క్ ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపింది.ఇప్పటివరకూ ఈమె సఫారీ టీమ్ తరఫున194 మ్యాచులు ఆడింది. 107 వన్డేలు, 86 టీ20లు, ఒక టెస్టు మ్యాచ్ ఆడిన ఈ ఆల్‌రౌండర్ మూడు ఫార్మట్లలో కలిసి 204 వికెట్లు పడగొట్టింది. నీకెర్క్ సారథ్యంలో 50 వన్డేలు, 30 టీ20లు ఆడిన దక్షిణాఫ్రికా 29 వన్డేల్లో, 15 పొట్టి క్రికెట్ మ్యాచుల్లో గెలుపొందింది. వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని సెలెక్టర్లు ఎంపిక చేసిన 20 మంది బృందంలో నీకెర్క్ ఒకరు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 1వ తేదీవరకూ డర్బన్ వేదికగా జరుగబోయే ఈ సన్నాహక శిబిరంలో ఆమె పాల్గొననుంది. ఈ క్యాంప్ తర్వాత పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది దక్షిణాఫ్రికా. దాంతో, ఫామ్ చాటుకొని.. ఫిటెనెస్ నిరూపించుకొని సెలెక్టర్ల దృష్టిలో పడాలనుకుంటుంది మాజీ కెప్టెన్. ఒకవేళ పాక్ పర్యటనకు ఎంపికైతే.. వరల్డ్ కప్ స్క్వాడ్‌లోనూ నీకెర్క్ ఉండే అవకాశముంది.